క్లుప్తంగా

ఎమ్మెల్యే యాదయ్యను కలిసిన సీఐ నవీన్


ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సీఐ

నవాబుపేట: ఇటీవల మోమిన్‌పేట సర్కిల్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన సీఐ నవీన్‌కుమార్ గురువారం ఎమ్మెల్యే కాలె యాదయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాంతిభద్రతల విషయంలో రాజీపడకుండా ప్రజలకు మంచి సేవలు అందించాలని ఎమ్మెల్యే యాదయ్య సూచించినట్లు సీఐ పేర్కొన్నారు.

కాగ్నానదిలో నిండిన గణనాథుల విగ్రహాలు


కాగ్నానదిలో తేలియాడుతున్న గణనాథులు

యాలాల: మండలంలోని కోకట్ కాగ్నానది వద్ద వినాయక నిమజ్జన కార్యక్రమం గురువారం తెల్లవారుజాము వరకు కొనసాగింది. పట్టణంలో ఏర్పాటు చేసిన భారీ వినాయకులను కాగ్నానదిలో నిమజ్జనం చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. వందల సంఖ్యలో ఉన్న గణనాథులను భక్తులు ట్రాక్టర్లు, ట్రాలీ ఆటోల్లో కాగ్నానది ప్రాంతానికి చేరుకొని పూజలు చేసి నిమజ్జనం చేశారు. ఉదయం వరకు నిమజ్జనం కోసం గణనాథులు తరలిస్తుండటంతో ప్రజలు ఆసక్తిగా వీక్షించారు. భారీగా గణనాథులు నిమజ్జనం చేయడంతో విగ్రహాలు నదిలో నీటిపై తేలియాడుతూ కనిపించాయి.

తపస్ మండల అధ్యక్షుడిగా మధుకర్


నూతన కమిటీ సభ్యులను అభినందిస్తున్న అంజిరెడ్డి తదితరులు

మోమిన్‌పేట: తపస్ (తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం) మండల అధ్యక్షుడిగా డి.మధుకర్ ఏకగ్రీవంగా ఎన్నికై నట్లు జిల్లా అధ్యక్షుడు అంజిరెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని టేకులపల్లి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ సంఘం ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శిగా మహేశ్, కోశాధికారిగా చంద్రశేఖర్, మీడియా కన్వీనర్‌గా మహేందర్, తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికై నట్లు తెలిపారు. కార్యవర్గ సభ్యుడిగా వెంకటేశం, రవికుమార్, సుధాకర్, ప్రభాకర్, శ్రీనివాస్, నాగరాజ్, సత్యవతిలను ఎన్నుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలతో లబ్ధి

డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ప్రతినిధి శ్రీనివాస్

పరిగి: దివ్యాంగులు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ప్రతినిధి శ్రీనివాస్ సూచించారు. పట్టణ కేంద్రంలోని వికలాంగులకు డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల శిక్షణ కార్యక్రమం గురువారం ముగిసింది. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వికలాంగులు స్వయం ఉపాధిని ఎంచుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. చిరువ్యాపారాలను ప్రోత్సహించేందుకు సంస్థ ఎల్లప్పుడు ముందుంటుందన్నారు. స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అర్హులైన వారికి రూ.25వేల ఆర్థిక సాయం అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంస్థ మేనేజర్ గురుదేవి, జిల్లా కోఆర్డినేటర్ రామేశ్వర్, సంజీవరావు, రాములు పాల్గొన్నారు.

కుక్కల నుంచి కాపాడండి

అనంతగిరి: కుక్కల బెడద నుంచి ప్రజలను కాపాడాలని బీఆర్ఎస్ యువజన జిల్లా నాయకుడు రాజేందర్‌గౌడ్ అన్నారు. వికారాబాద్ మండలంలోని పులుమద్ది గ్రామానికి చెందిన కిష్టయ్యను కుక్క దాడి చేసి గాయపరిచింది. దీంతో ఆయనను పరామర్శించి మాట్లాడారు. ప్రభుత్వం కుక్క కాటుకు గురైన వారికి రూ.25వేలు ఎక్స్‌గ్రేషియా అందించాలన్నారు. ఆయన వెంట నాయకులు వెంకటేష్, నర్సింలు, రాములు, సురేష్, సత్యం, లక్ష్మీకాంత్, జంగయ్య ఉన్నారు.

బాల్‌రెడ్డికి పరామర్శ

తాండూరు: తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పటోళ్ల బాల్‌రెడ్డిని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పరామర్శించారు. రెండు రోజుల బాల్‌రెడ్డికి తీవ్రమైన కడుపు నొప్పి రావటంతో హైదరాబాద్ నగరంలోని యశోద ఆస్పత్రికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న మనోహర్‌రెడ్డి గురువారం ఆస్పత్రి వెళ్లి బాల్‌రెడ్డిని పరామర్శించారు.

అసంపూర్తిగా హాస్టల్ భవనం

- 12 ఏళ్లుగా కొనసాగుతున్న పనులు
- గ్రౌండ్‌ఫ్లోర్ పూర్తయినా నిరుపయోగం
- పట్టించుకోని ఈడబ్ల్యూఐడీసీ అధికారులు


నిలిచిపోయిన మోడల్ స్కూల్ హాస్టల్ భవన నిర్మాణ పనులు

బంట్వారం: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ హాస్టల్ భవనం అసంపూర్తిగా ఉంది. గ్రౌండ్ ఫ్లోర్ పూర్తయినా నేటికి ప్రారంభానికి నోచుకోవడం లేదు. దీంతో విద్యార్థులకు ఎలాంటి ఉపయోగం లేకుండా పోయింది. స్కూల్‌కు ఇళ్ల నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. గుత్తేదారుకు పే అండ్ అకౌంట్స్ నుంచి సకాలంలో బిల్లులు అందకపోవడంతో ఏళ్ల తరబడి నిర్మాణం పూర్తి కావడం లేదు. హాస్టల్ భవనం నిర్మాణానికి 12 సంవత్సరాల కిందట రూ.1.28 కోట్లు మంజూరయ్యాయి. 2012 సంవత్సరంలో టెండర్‌లో పనులు దక్కించుకున్న గుత్తేదారు పునాది దశలోనే వదిలేశాడు. ఈ క్రమంలో సంబంధిత టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ అధికారులు అప్పట్లో రీటెండర్ వేయడంతో మరో కాంట్రాక్టర్ ముందుకు వచ్చాడు. కాని, బిల్లులు అందకపోవడంతో సదరు కాంట్రాక్టర్ ఏళ్ల తరబడి పనులు పూర్తి చేయలేకపోతున్నారు. 12 ఏళ్ల కిందట మంజూరైన హాస్టల్ భవనం అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇప్పటికీ పూర్తికాకపోవడం విచారకరమని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ప్రస్తుతం గ్రౌండ్ ఫ్లోర్ పనులు పూర్తయి.. మొదటి అంతస్తు స్లాబ్ దశలోనే ఆగిపోయింది.

విద్యార్థులకు అసౌకర్యం

సుమారు 650 మంది విద్యార్థులు తెలంగాణ మోడల్ స్కూల్ బంట్వారంలో ఇంటర్ వరకు చదువుకుంటున్నారు. హాస్టల్ భవనం పూర్తి కాకపోవడంతో విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. హాస్టల్ వసతి ముఖ్యంగా బాలికల కోసమే మంజూరు చేశారు. హాస్టల్‌లో 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు 100 మంది బాలికలు ఉండేలా సదుపాయం ఉంది.

బిల్లులు చెల్లించకపోవడంతోనే ఆలస్యం

టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ పరిధిలోని పనులను సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. హాస్టల్ భవనం నిర్మాణం సమయంలో ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణ లేనే లేదు. పనుల నాణ్యతను పరిశీలించే వారు లేరు. గుత్తేదారుకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతోనే పనులు అర్ధాంతరంగా నిలిచిపోయినట్లు తెలుస్తుంది. ఇప్పటికైనా ఆ శాఖ ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాల్సిన విద్యార్థినిలు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం



మోడల్ స్కూల్ హాస్టల్ భవనం 12 ఏళ్ల నుంచి పూర్తి కావడం లేదు. ఇప్పటికే ఇద్దరు గుత్తేదారులు మారినట్లు తెలుస్తుంది. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తా. హాస్టల్ వసతి లేకపోవడంతో బాలికలు అసౌకర్యానికి గురవుతున్నారు. సరియైన రవాణా సదుపాయం లేక దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను సంబంధిత శాఖ ఉన్నతాధికారులకు కూడా వివరిస్తా.

– చంద్రప్ప ఎంఈఓ

త్వరలోనే పూర్తి చేస్తాం

మోడల్ స్కూల్ హాస్టల్ భవనం జీప్లస్–1 కట్టాల్సి ఉన్నప్పటికీ సబ్ కాంట్రాక్టర్ కొన్ని ఇబ్బందుల వల్ల గ్రౌండ్ ఫ్లోర్ పూర్తి చేసి వదిలేశారు. మిగిలిన పనులకు మళ్లీ కొత్త వారికి అప్పగిస్తాం. ఎవ్వరికి పనులు అప్పగించినా పాత రేట్ల ప్రకారమే డబ్బులు చెల్లిస్తాం. త్వరలోనే విద్యార్థులకు హాస్టల్ భవనాన్ని అందుబాటులోకి తీసుకొస్తాం. ఇందుకు సంబంధించిన బడ్జెట్ రూ.40 లక్షలు ఉన్నాయి. మరో రూ. 40 లక్షల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. హాస్టల్ భవనాన్ని ప్రారంభించి 100 మంది విద్యార్థులు ఉండేలా సిద్ధం చేస్తాం.

– రాజు డీఇ, టీఎస్ఈడబ్ల్యూఐడీసీ

రోడ్డు ఇలా.. నడిచేదెలా?


బురదమయంగా శ్మశాన వాటిక రోడ్డు

దుద్యాల్ : గత 10 రోజుల క్రితం కురిసిన వర్షాల కారణంగా మట్టి రోడ్ల పరిస్థితి మరింత అధ్వానంగా మారాయి. మండలంలోని కుదురుమల్ల గ్రామం నుంచి స్మశాన వాటికకు వెళ్లే మార్గం చాలా దయనీయంగా మారిందని గ్రామస్తులు వాపోతున్నారు. వానలు పడకముందు కొంత వరకు ఫర్వాలేదనుకున్న ఈ రోడ్డు వర్షాలు కురిసిన తర్వాత మరింత బురదమయంగా మారి, నడవడానికి చాలా ఇబ్బందిగా తయారైందన్నారు. గ్రామంలో ఎవరైనా ఆకస్మిత్తుగా మృతి చెందితే స్మశాన వాటికకు తీసుకెళ్లడానికి చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు కల్పించుకుని రోడ్డును తాత్కాలిక మరమత్తు చేపట్టాలని కోరుతున్నారు.

వక్ఫ్‌చట్ట సవరణలను ఆపాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎంఐఎం నేతలు

కొడంగల్ రూరల్ : పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన వక్ఫ్ చట్ట సవరణలను వెంటనే ఆపాలని ఎంఐఎం పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్‌బి.గుల్షన్ అన్నారు. గురువారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో మైనారిటీ నాయకులు, పార్టీ కార్యకర్తలతో కలిసి నిరసనలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముస్లిం సంపదను దెబ్బతీయడంతో పాటు సమాజాన్ని ఆర్థికంగా బలహీనపరిచే ఉద్దేశంతో బిల్లును రూపొందించినట్లు ఆరోపించారు. వక్ఫ్ చట్ట సవరణలను ఆపాలని, లేనిచో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసనలు చేపట్టనున్నట్లు తెలిపారు. అక్కడి నుంచి ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని తహసీల్దార్ విజయకుమార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఎండీ.సర్తజ్ హుస్సేన్, షేక్ ఆబిద్, ఎండీ.అజర్, షేక్ రోమన్, ఎండీ.నిసార్ బేగ్, ఎండీ షన్వాజ్, ఎండీ.ఎజాజ్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు ప్రభుత్వం అండ


బాధిత మహిళలకు చెక్కు అందజేస్తున్న నేతలు


మర్పల్లి: లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న నాయకులు

దుద్యాల్: నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ ఎంతగానో ఉపయోగపడుతుందని మండల కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు రవి అన్నారు. మండలంలోని ఈర్లపల్లి గ్రామానికి చెందిన నీలి శ్రీనివాస్‌కు సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.48వేల చెక్కును గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాధితుడి కుమార్తె అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందింది. దీంతో ఆస్పత్రి ఖర్చుల్లో భాగంగా సీఎంఆర్ఎఫ్ ద్వారా కొంత మొత్తం వచ్చినట్లు తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

కుల్కచర్ల: పేదలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని కాంగ్రెస్ పార్టీ చౌడాపూర్ మండల అధ్యక్షుడు ఎల్పటి అశోక్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని మందిపల్ గ్రామానికి చెందిన సిహెచ్. లక్ష్మి అనారోగ్యంతో చికిత్స పొందుతున్నందున సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడూతూ.. బడుగు బలహీనవర్గాల కుటుంబాలకు ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో చౌడాపూర్ మండల యువజన విభాగం అధ్యక్షుడు రాము, మండల పార్టీ ఉపాధ్యక్షుడు నరసింహనాయక్, నాయకులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి వరం

మర్పల్లి: సీఎం సహాయనిధి పేద ప్రజలకు వరం లాంటిదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మల సురేశ్ పేర్కొన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆదేశాల మేరకు గురువారం మండలంలోని ఆయా గ్రామాలు చెందిన 47 మంది లబ్ధిదారులకు 16 లక్షల 83 వేల సీఎం సహాయనిధి చెక్కులు పార్టీ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా సురేశ్ మాట్లాడుతూ.. వివిధ వ్యాధులతో బాధపడుతూ కార్పొరేట్ ఇతరాత్ర ఆస్పత్రుల్లో చికిత్సలు పొందుతూ సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు పెట్టుకున్న ప్రతి ఒక్కరికి స్పీకర్ ప్రసాద్‌కుమార్ సహకారంతో సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో మైనార్టీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు ఖలీమొద్దీన్, పీఏసీఎస్ చైర్మన్ ప్రవీన్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఫని, మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు మధుకర్‌రెడ్డి ఉన్నారు.

ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి


సమావేశంలో మాట్లాడుతున్న జనార్దన్

యాలాల: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, ఇంపాక్ట్ సర్టిఫైడ్ ట్రైనర్, రిటైర్డ్ ఉపాధ్యాయుడు జనార్దన్ అన్నారు. మండలంలోని పగిడియాల ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు పక్కా ప్రణాళికతో పదవ వార్షిక పరీక్షలకు సిద్ధమవ్వాలన్నారు. పాఠశాలలో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా చదువు కొనసాగించాలని చెప్పారు. ఈ విషయంలో విద్యార్థుల తల్లిదండ్రులు వారికి సహకారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్ఎం కృష్ణయ్య, ఉపాధ్యాయుడు రవి తదితరులు ఉన్నారు.

భవిష్యత్‌ను నిర్ణయించేది పుస్తకాలే..

ఇన్‌చార్జి లైబ్రేరియన్ మహేందర్



యాలాల: గ్రంథాలయంలోని పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని యాలాల గ్రంథాలయ శాఖ ఇన్‌చార్జి లైబ్రేరియన్ మహేందర్ అన్నారు. డీఎస్సీ పరీక్షా సమయంలో పూర్తిస్థాయిలో పుస్తకాలు అందుబాటులో ఉంచామన్నారు. ప్రస్తుతం చరిత్ర, నవలలు, స్వాతంత్ర్య ఉద్యమ చరిత్ర, కథల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. స్మార్ట్ ఫోన్ల రాకతో యువత వాటి మోజులో పడి, భవిష్యత్తును నిర్ణయించే పుస్తకాలకు దూరం కావడం బాధాకరమన్నారు. పుస్తకాలతో పాటు అన్ని రకాల వార్తపత్రికలు, పాఠకులకు అవసరమైన సౌకర్యాలు గ్రంథాలయంలో ఉంచామన్నారు. భవిష్యత్తులో పోటీ పరీక్షల నేపథ్యంలో మరిన్ని పుస్తకాలు అందుబాటులో ఉంచుతామన్నారు.

సందడిగా గణేశుడి లడ్డూ వేలం


పెద్దేముల్: లడ్డూను వేలంలో దక్కించుకున్న నారాయణరెడ్డి

యాలాల: మండలంలోని దేవనూరు గ్రామంలోని హనుమాన్ ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన వినాయకుడి లడ్డూ రూ.1.10లక్షలు పలికింది. గ్రామానికి చెందిన పరమేశ్వర్ వేలం పాటలో లడ్డూను దక్కించుకున్నాడు. గ్రామీణ ప్రాంతమైన దేవనూరులో రూ.1.10లక్షలకు లడ్డూ వేలం పలకడం ఆసక్తిగా మారింది. లడ్డూను దక్కించుకున్న పరమేశ్వర్‌ను కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు ప్రవీణ్ కుమార్ ఘనంగా సన్మానించారు. అనంతరం వినాయకుడిని స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు.

లడ్డూ వేలం రూ.51 వేలు

పెద్దేముల్: మండలంలోని మంబాపూర్ గ్రామంలో బుధవారం రాత్రి వినాయకుడి నిమజ్జనం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయకుడి లడ్డూను భక్తులు వేలం వేయగా రూ. 51 వేలకు కోటపల్లి వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ నారాయణరెడ్డి దక్కించుకున్నారు.

చెట్ల కొమ్మల తొలగింపు


చెట్లకొమ్మలు తొలగిస్తున్న విద్యుత్ సిబ్బంది, రాములు

దోమ : విద్యుత్ వైర్లకు తాకుతున్న చెట్ల కొమ్మలను తొలగించాలని మాజీ ఎంపీటీసీ రాములు తెలిపారు. గురువారం మండలంలోని బొంపల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ సమీపంలో ఉన్న విద్యుత్ వైర్లపై చెట్ల కొమ్మలు అల్లుకుపోయాయి. వీటిని గ్రామస్తులు మాజీ ఎంపీటీసీ దృష్టికి తీసుకురాగా.. ఆయన విద్యుత్ అధికారులతో మాట్లాడి ఎల్‌సీ తీసుకొని చెట్టు కొమ్మలను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెట్టు కొమ్మల వైర్లకు తాకడం వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. విద్యుత్ అధికారులు ఎప్పటికప్పుడు చెట్టు కొమ్మలు తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు షేర్‌ఖాన్, సాయిసంతోష్, శ్రీనివాస్, బెస్త నర్సింహులు, మల్లేశ్ యాదవ్ పాల్గొన్నారు.

ఆధార్ క్యాంపుతో ప్రయోజనం

దుద్యాల్: మండలంలోని హస్నాబాద్ గ్రామంలోని బాలికల ప్రాథమిక పాఠశాలలో గురువారం ఆధార్ క్యాంపు ప్రారంభించినట్లు నిర్వాహకుడు నరేశ్ తెలిపారు. ఈ సందర్భంగా నరేశ్ మాట్లాడుతూ.. కొత్త ఆధార్ కార్డులతో పాటు తప్పుఒప్పులను సరిచేయడం, అడ్రస్ మార్చడం, ఫోన్ నంబర్ అనుసంధానం చేయడం, ఫొటో మార్పు, పుట్టిన తేదీ మార్పు వంటి వివిధ రకాల సేవలను అందించనున్నట్లు తెలిపారు. కొన్ని రోజులు మాత్రమే అందుబాటులో ఉంటుందని, ఈ ఆధార్ క్యాంపును ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

నాణ్యమైన విద్యను అందించాలి

కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు లాల్యానాయక్


విద్యార్థులను చదివిస్తున్న లాల్యానాయక్

దోమ : ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందించాలని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు లాల్యానాయక్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని బుద్లాపూర్ పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేసి తరగతి గదులు, రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల ఎఫ్ఎల్ఎస్ వర్క్ షీట్స్ పరిశీలించి విద్యార్థులతో చదివించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెరుగైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పాఠశాలలో ఉపాధ్యాయులు తయారు చేసిన పలు అంశాలకు సంబంధించి బోధనోపకరణాలను(టీఎల్ఎం)ను పరిశీలించి, పలు సూచనలు చేశారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటిస్తూ మెనూ ప్రకారం అందించాలన్నారు. ఎఫ్ఏ1, పీటీఎం, యూనిఫామ్స్, బేస్‌లైన్, ఎన్ఏఎస్, యూడైస్‌లను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలు మెరుగుపర్చాలి

బంట్వారం: మండలంలోని తొర్మామిడి యూనియన్ బ్యాంకు వినియోగదారులకు మెరుగైన సేవ లు అందించాలని బీఎస్పీ జిల్లా కోఆర్డినేటర్ డి రమేశ్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత కొంతకాలంగా బ్యాంకులో సర్వర్, ఇతర సమస్యలతో ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. కనీసం బ్యాంకులో ప్రింటర్ కూడా పని చేయకపోవడం విచారకరమన్నారు. సంబంధిత మేనేజర్‌ను అడిగినా సరైన సమాధా నం చెప్పడం లేదు.బ్యాంకు సేవలు మెరుగు పరిచి ఖాతాదారులు ఇబ్బంది పడకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

ఆదిదేవుడు వినాయకుడు

పరిగి: దేవుల్లో ఆది దేవుడు వినాయకుడని ఏపూజ జరిగిన మొదటగా వినాయకుడి పూజా చేయాల్సి ఉంటుందని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలోని బ్రాహ్మణవాడ హనుమాన్ దేవాలయంలో కొలువుదీరిన గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు భక్తి మార్గాన్ని అనుసరించాలని సూచించారు. తొమ్మిది రోజులు జరిగితే వినాయక ఉత్సవాల్లో కులమత బేదాలు లేకుండా ప్రతి ఒక్కరు ఉత్సవాల్లో పాల్గొని ఘనంగా నిర్వహించుకోవాలని సూచించారు.

ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనది


ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంపీడీఓ తదితరులు

ఇన్‌చార్జి ఎంపీడీఓ డానియల్

బంట్వారం: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనదని కోట్‌పల్లి ఇన్‌చార్జి ఎంపీడీఓ డానియల్ అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని గురువారం మానవ వనరుల కేంద్రంలో కోట్‌పల్లి మండల ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ చంద్రప్ప మాట్లాడుతూ.. విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనన్నారు. సమ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైందన్నారు. అన్ని వృత్తుల కంటే ఉపాధ్యాయ వృత్తి గౌరవ ప్రదమైనదన్నారు. అనంతరం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింగ్ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులను శాలువా పూలమాలలతో సత్కరించి మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాస్, ఎంఈఓ చంద్రప్ప, ఎఎంసీ చైర్మన్ అంజయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింగ్ నాయక్, కోట్‌పల్లి మాజీ సర్పంచ్ విజయలక్ష్మి, ఆయా పాఠశాలల జీహెచ్ఎంలు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అమ్మనాన్నలు, గురువులను గౌరవించేవారే నిజమైన విజేతలు

- జీవితం అందమైనది
- ఆత్మహత్యలకు పాల్పడొద్దు
- మోటివేషనల్ వక్త సేవక్ కుమార్



అవగాహన కల్పిస్తున్న మోటివేటర్ సేవక్‌కుమార్

బొంరాస్‌పేట: విద్యార్థి, యువతలో ఉన్న శక్తియుక్తులే తనను హీరోను చేస్తాయని మోటివేషనల్ వక్త సేవక్‌కుమార్ అన్నారు. గురువారం 'మేము సైతం యువతకోసం' అనే అవగాహన, ప్రేరణ తరగతి కొడంగల్ లయన్స్ క్లబ్, తెలంగాణ విద్యావంతుల వేదిక, పలు సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా లయన్స్ క్లబ్ నాయకులు ముద్దప్పదేశ్‌ముఖ్, దాసప్పయాదవ్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ రవీంద్రయాదవ్ మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ప్రేరణ తరగతిని ప్రారంభించారు. మూడున్నర గంటలు సాగిన కార్యక్రమంలో యువత, విద్యార్థిలో మార్పు కలిగే అనేక విషయాలను సేవక్ చెప్పారు. వీడియోలు, బొమ్మలు చూపిస్తూ కొందరి ఆదర్శప్రాయులైన జీవితాలను వివరించారు. ఎవరైతే తల్లిదండ్రులను, గురువులను గౌరవిస్తారో వారే నిజమైన హీరోలని అన్నారు.. మనిషి ఉన్న ఒకే ఒక జీవితం చాలా అందమైనదని, దానిని అనుభవించాలే తప్ప, క్షణికావేశంలో ప్రాణాలు తీసుకోవద్దని సూచించారు. ఈ పేరణ తరగతులకు 1300 మంది విద్యార్థులు హాజరయ్యారు. లయన్స్‌క్లబ్ ఈలాంటి కార్యక్రమాలను నిర్వహించడాన్ని పలు వురు అభినందించారు. కార్యక్రమంలో టీవీవీ రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్, ఎంఈఓ రాంరెడ్డి, నిర్వాహకులు శ్రీనివాస్, నరేశ్‌రాజ్, చంద్రశేఖర్, గోపా ల్, రమేశ్ బాబు, మాసని వెంకటయ్య పాల్గొన్నారు.